నమస్తే తెలంగాణ
హనుమకొండ
5 | వరంగల్, శనివారం 19 అక్టోబర్ 2024 | HANUMAKONDA

జనగామ వ్యవసాయ మార్కెట్‌లో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్

పత్తి కొనుగోళ్లు షురూ

- నమస్తే కథనంతో కదిలిన జిల్లా యంత్రాంగం
- జనగామ మార్కెట్ సహా జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ కొనుగోలు కేంద్రాలు

నమస్తే ఎఫెక్ట్

జనగామ, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ) : 'దిగు బడి రాకపాయె.. మద్దతు లేకపాయె' శీర్షికన నమస్తేలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి అధికారుల స్పందిం చారు. జనగామ వ్యవసాయ మార్కెట్ యార్డు సహా మరో ఐదు కాటన్ జిన్నింగ్ మిల్లుల్లో శుక్రవారం సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. రామలింగ కాటన్ ఇండస్ట్రీస్, హరిహర, సిరి, సత్యసాయి, స్టేషన్‌ఘ న్‌పూర్ మార్కెట్ పరిధిలోని శివసాయి కాటన్ మిల్లుల్లో సీసీఐ పత్తి కొనుగోళ్లు మొదలుపెట్టింది. రైతులు పత్తిలో 8శాతం తేమ ఉండేలా చూసుకొని మద్దతు ధర రూ.7,521, 8శాతం నుంచి తేమ శాతం పెరిగిన ప్రతి ఒక్క శాతానికి ఒక శాతం చొప్పున ధర తగ్గుతుందని, 12శాతానికి మించి తేమ ఉన్న పత్తిని సీసీఐ కొనుగోలు చేయదని జిల్లా మార్కెటింగ్ అధికారి నరేంద్ర ఒక ప్రకట నలో తెలిపారు. అలాగే వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఏర్పాటు చేసిన వాట్సాప్ చాట్‌బోట్ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 8897281111 నంబర్‌ను మొబైల్‌లో సేవ్ చేసు కొని హాయ్ అని టైప్ చేస్తే కాటన్ అమ్మకం, అర్హత, తక్‌పట్టీ వివరాలు చెల్లింపు స్థితి, సీసీఐ సెంటర్‌లో వేచి ఉండే సమయం వంటి వివరాలు తెలుసుకోవచ్చని పేర్కొ న్నారు. సీసీఐకి పత్తి అమ్ముకోవాలంటే ఆధార్ ప్రామాణి కత అనేది తప్పనిసరని, పత్తి కొనుగోలు చెల్లింపులను ఆధార్‌తో అనుసంధానం అయిన బ్యాంకు ఖాతాలో మాత్రమే జమ చేస్తారని డీఎంవో తెలిపారు. జనగామ వ్యవసాయ మార్కెట్ యార్డులో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ బునుక శివరాజ్ యాదవ్ శుక్రవారం ప్రారంభించారు. రైతులు నాణ్యతా ప్రమాణాలు పాటించి యార్డుకు పత్తి తీసుకొస్తే మద్దతు ధర లభిస్తుందని తెలి పారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, ప్రత్యేక శ్రేణి కార్యదర్శి సంగినేని శ్రీనివాస్ పాల్గొన్నారు.

కేయూ వీసీగా ప్రతాప్‌రెడ్డి

- 1989లో ఓయూ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరిక
- అనేక కీలక పదవులు, అవార్డులు సొంతం
- కేయూ కొత్త వీసీకి సమస్యల స్వాగతం

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 18 : కాకతీయ యూనివర్సిటీకి ప్రభుత్వం ఎట్టకేలకు వైస్ చాన్స్‌లర్‌గా కే ప్రతాప్‌రెడ్డిని నియమించింది. ఈ మేరకు శుక్రవారం గవర్నర్ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు. ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ మే 21న ఉద్యోగ విర మణ పొందగా ఐదు నెలల తర్వాత వీసీని నియమిం చారు. వర్సిటీ 15వ వీసీగా ఉస్మానియా యూనివర్సిటీ విశ్రాంత జంతుశాస్త్ర విభాగ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డిని నియ మించింది. ప్రతాప్‌రెడ్డి జువాలజీ విభాగంలో విశిష్ట విద్యావేత్త.. మూడు దశాబ్దాలకుపైగా బోధన, పరిశోధనా అనుభవం కలిగి ఉన్నారు. 1961 జూన్ 15న రంగారెడ్డి జిల్లా యాచారం గ్రామంలో జన్మించిన ఆయన ఉస్మా నియా విశ్వవిద్యాలయంలో 1981లో జువాలజీలో డిస్టింక్షన్‌తో బీఎస్సీ(హానర్స్) పూర్తి చేశారు. 1983లో న్యూరోబయాలజీలో ఎమ్మెస్సీ, 1988లో జువాలజీ (న్యూరోబయాలజీ)లో పీహెచ్‌డీ చేశారు.

1989లో ఓయూలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా..

ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి తన విద్యావృత్తిని 1989లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ప్రారంభించారు. 1998లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. 2006లో పూర్తి ప్రొఫెసర్‌గా నియ మితులయ్యారు. 2021లో పదవీ విరమణ చేశారు. ప్రతాప్‌రెడ్డి 25 మందికిపైగా పీహెచ్‌డీ విద్యార్థులకు మార్గ నిర్దేశకుడిగా వ్యవహరించడమే కాకుండా జాతీయ, అంత ర్జాతీయ జర్నల్స్‌లో 104కిపైగా ప్రచురణలు చేశారు. ఆయనకు 1,319 సిటేషన్లు, 16 హెచ్-ఇండెక్స్, 21 ఐ-ఇండెక్స్ ఉన్నాయి. జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో 487 పత్రాలను సమర్పించారు. 7 పుస్తకాలు ప్రచురిం చారు.12 ముఖ్య పరిశోధనా ప్రాజెక్టులను పూర్తి చేశారు.

కీలక పదవులు..

బోధనా పరిశోధనలో ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి చేసిన కృషికి తోడు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పలు కీలక పరిపాలనా పదవులను నిర్వర్తించారు. 2020-2021లో సైన్స్ విభాగ డీన్‌గా, 2018-2020లో యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్‌గా, 2013-2014లో ఉస్మా నియా విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టా రు. అదనంగా ఆయన జువాలజీ విభాగాధిపతిగా, అడ్మి షన్స్ డైరెక్టర్‌గా, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా సేవలు అందిం చారు. 2016-2018 మధ్యకాలంలో ఆయన రాస్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ప్యారసిటాలజీ డైరెక్టర్‌గా పనిచేశారు.

అనేక అవార్డులు..

తన కెరీర్‌లో ప్రతాప్‌రెడ్డి అనేక ప్రతిష్ఠాత్మక అవార్డుల ను అందుకున్నారు. 2017లో తెలంగాణ ప్రభుత్వం నుం చి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, 2015లో యూజీ సీ-బీఎస్‌ఆర్ మిడ్-కెరీర్ అవార్డును అందుకున్నారు. 1987లో ఎస్ఎస్ పర్మార్ ఫౌండేషన్ ప్రైజ్ లభించింది.

కొత్త వీసీకి సమస్యల స్వాగతం..

కాకతీయ యూనివర్సిటీ కొత్త వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రె డ్డికి సమస్యలు స్వాగతం పలుకనున్నాయి. కేయూలో నెల కొన్న అధ్యాపకుల కొరత, పీహెచ్‌డీ అడ్మిషన్ల లొల్లి, కేయూ భూముల ఆక్రమణలు.. ఇలా అనేక సమస్యలను కొత్త వీసీ ప్రతాప్‌రెడ్డి ఎదుర్కోవాల్సి ఉన్నది. ఇప్పటికే మాజీ వీసీల అక్రమాలపై విచారణ కొనసాగుతున్న నేప థ్యంలో కొత్త వీసీ పనితీరు ఎలా ఉండబోతుందోనని అధ్యాపకులు, అధికారులు, విద్యార్థులు, మేధావులు చర్చించుకోవడం విశేషం.

రైల్వే బైపాస్ లైన్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్

- హసన్‌పర్తి- నష్కల్ మధ్య నిర్మాణం
- రెవెన్యూ అధికారులు భూమి అప్పగించాలని రైల్వేశాఖ ఉత్తర్వులు

కాజీపేట, అక్టోబర్ 18 : దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలోని హసన్‌పర్తి రోడ్డు- నష్కల్ రైల్వే స్టేషన్ల మధ్య చేప ట్టనున్న బైపాస్ లైన్‌కు కేంద్ర మంత్రిత్వ శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. హనుమ కొండ, జనగామ జిల్లాల్లోని హసన్‌పర్తి రోడ్డు, జయగిరి, మడిపల్లి, దేవన్నపేట, ఉనికిచర్ల, ధర్మ సాగర్, పెద్దపెండ్యాల, కరుణాపూర్ మీదుగా నష్కల్ రైల్వే స్టేషన్ వరకు బైపాస్ లైన్ నిర్మించా లని, గూడ్స్ రైళ్లను ఈ మార్గం గుండా నడిపించాలని రైల్వే శాఖ నిర్ణయించింది. కాజీపేట మీదుగా ప్రయాణికుల రైళ్ల రాకపోకలకు ఇబ్బందులు కలుగకూడదనే లక్ష్యంతో 24.55 కిలో మీటర్ల మేర బైపాస్ లైన్ నిర్మించనున్నారు. ట్రాక్ నిర్మాణానికి ఈ నెల 16న రైల్వే అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, భూ సేకరణకు సంబంధించి అంచనాలు రూపొందించారు. ఈ క్రమంలో హనుమకొండ, స్టేషన్ ఘన్‌పూర్ ఆర్డీవోలతో పాటు చిల్పూర్, ధర్మసాగర్, హసన్ పర్తి తహసీల్దార్లకు వేగంగా భూ సేకరణ చేపట్టాలని రైల్వే అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

- ఎమ్మెల్యేలు వర్సెస్ ప్రత్యర్థి వర్గాలు
- పరస్పరం తీవ్ర విమర్శలు, హెచ్చరికలు
- రాస్తారోకోలు, ధర్నాలతో రచ్చరచ్చ
- అవసరమైతే ఢిల్లీకి వెళ్తామంటూ వార్నింగ్
- రోజురోజుకూ పెచ్చుమీరుతున్న గొడవలు
- తాజాగా గాంధీభవన్ వద్ద వేలేరు నేతల నిరసన

ఇందిరమ్మ రాజ్యంలో కమిటీల కొట్లాట

కాంగ్రెస్‌లో తారస్థాయికి వర్గపోరు

కాంగ్రెస్‌లో 'ఇందిరమ్మ కమిటీ'లు పార్టీకి కొత్త తలనొప్పి తీసుకొచ్చినట్లయింది. ఇప్పటికే రేవంత్ సర్కారు కొలువుదీరినప్పటి నుంచి ఉమ్మడి వరంగల్‌లో నివురుగప్పిన నిప్పులా ఉన్న వర్గపోరు కొద్దిరోజులుగా భగ్గుమంటోంది. దీనికి తోడు ఇటీవల సంక్షేమ పథకాల అమలు కోసం ప్రభుత్వం ఏర్పాటుచేయాలనుకున్న 'ఇందిరమ్మ కమిటీ'లతో మరింత ముదిరి కుమ్ములాటలకు దారితీసింది. ముఖ్యంగా స్టేషన్‌ఘన్‌పూర్, మహబూబాబాద్‌లో పరిస్థితి తారస్థాయికి చేరింది. కమిటీలో తమకు ప్రాధాన్యం ఇవ్వకుండా కొత్తగా వచ్చిన వారు పెత్తనం చెలాయిస్తున్నారంటూ పార్టీనే నమ్ముకొని ఉన్న సీనియర్లు, ఎమ్మెల్యే వర్గంపై ఆగ్రహంతో ఉండగా రోజుకో చోట రాస్తారోకోలు, నిరసనలతో పాటు బిష్టిబొమ్మల దహనాల దాకా వెళ్లింది. అంతటితో ఆగకుండా ఎమ్మెల్యే లకు వార్నింగ్‌లు, పరస్పరం విమర్శల నడుమ కొందరు గాంధీభవన్ మెట్లెక్కగా, ఇంకొందరు అవసరమైతే ఢిల్లీకైనా వెళ్తామనడం అంతటా చర్చనీయాంశమవుతోంది.

- వరంగల్, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

కాంగ్రెస్ వాళ్ల తోనే కమిటీలు..

రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు ఏర్పాటు చేస్తున్న ఇందిరమ్మ కమిటీల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులే సభ్యులుగా ఉంటున్నారు. గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారి చైర్మన్‌గా, కార్యదర్శి కన్వీనర్‌గా ఉంటున్నారు. మున్సిపా లిటీలు, కార్పొరేషన్లలో వార్డు కౌన్సిలర్, కార్పొ రేటర్ చైర్మన్‌గా వార్డు/డివిజన్ అధికారి కన్వీన ర్‌గా ఉంటారు. గ్రామ, పట్టణ ఇందిరమ్మ కమి టీలో స్వయం సహాయ సంఘాల్లోని ఇద్దరు మహిళలు.. మరో ముగ్గురు సాధారణ వ్యక్తులు సభ్యులుగా ఉంటారు. వీరు బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల నుంచి ఒక్కొక్కరు చొప్పున ఉండాలని ప్రభుత్వం నిబంధనలు పెట్టింది. కమిటీలో నియమించే స్వయం సహాయక సంఘాల మహిళలు, మరో ముగ్గురు సభ్యుల పేర్లను ఎంపీడీవో, మున్సిపల్ కమిషనరు కలెక్టరుకు ప్రతిపాదిం చాల్సి ఉంటుంది. అనంతరం ఉమ్మడి జిల్లా ఇంచార్జీ మంత్రి ఆమోదం తర్వాత నియ మాకం జరుగుతుంది. కాంగ్రెస్ నాయకులనే ఈ కమిటీల్లో సభ్యులుగా పెడుతున్నారు. దీంతో ఆ పార్టీలోని వారి మధ్య వర్గపోరు తీవ్ర మవుతున్నది. ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో ఇందిరమ్మ కమిటీలు కీలకంగా వ్యవహరించ నున్నాయి. కాంగ్రెస్ పార్టీ వారిని ఈ కమిటీల్లో నియమించడం వల్ల ఇండ్ల కేటాయింపులో అర్హులకు న్యాయం జరగదనే విమర్శలు పెరు గుతున్నాయి. అధికార పార్టీ వారికి మేలు చేసేందుకే ఇందిరమ్మ కమిటీలు పని చేస్తాయని అభిప్రాయం ఉన్నది.

మానుకోటలో ఏకపక్ష వైఖరిపై తీవ్ర అసంతృప్తి

మహబూబాబాద్ నియోజకవర్గంలో ఇందిరమ్మ కమిటీ ఏర్పాటులో ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని మండల స్థాయి కాం గ్రెస్ నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే వైఖరి మార్చుకోవాలని హెచ్చరిస్తున్నారు. పార్టీ శ్రేణుల మనోభావాలను పట్టించుకోకుంటే పొలిమేర వరకు తరిమికొడతామని వార్నింగ్ ఇస్తున్నారు. నియోజకవ ర్గంలోని అన్ని మండలాల్లోనూ వర్గపోరు నడుస్తున్నది.

స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఢీ అంటే ఢీ

సంక్షేమ పథకాల అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు కాంగ్రెస్ పార్టీలోనే ఘర్షణలకు కారణమవుతు న్నది. దాదాపు అన్ని నియోజకవర్గాల్లోనూ ఈ కమిటీలు కాంగ్రెస్‌లో వర్గపోరును పెంచుతు న్నది. గ్రామాల్లోని కాంగ్రెస్ వర్గపోరు అక్కడ క్కడా ఎమ్మెల్యేలకు వార్నింగ్‌లు ఇచ్చేదాకా వెళ్తున్నది. బీఆర్ఎస్ తరపున గెలిచి కాంగ్రెస్‌లో చేరిన కడియం శ్రీహరి ఎమ్మెల్యేగా ఉన్న స్టేషన్ ఘన్‌పూర్‌లో ఈ కమిటీల గొడవలు ఎక్కువగా జరుగుతున్నాయి. శ్రీహరి వర్గం గ్రామాల్లో పెత్తనం చేస్తుండడంపై మొదటినుంచి కాంగ్రె స్‌లో ఉన్న వారు తీవ్ర అసంతృప్తితో ఎమ్మెల్యే దిష్టిబొమ్మలను దహనం చేసే వరకు వెళ్తు న్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు, మండల స్థాయిలోని నేతలంతా కడియం వర్గంతో ఢీ అంటే ఢీ అంటున్నారు. కాంగ్రెస్‌లో మొదటి నుంచి తమకు ఇందిరమ్మ కమిటీలలో ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.



హైదరాబాద్‌లోని గాంధీ భవన్ వద్ద నిరసన తెలుపుతున్న పార్టీ నాయకులు

- పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలను విస్మరిస్తున్నారు
- వేలేరు మండల పాత కాంగ్రెస్ నాయకులు

పరకాల, జనగామ, ఇల్లెందులో అదే తీరు..

పరకాల నియోజకవర్గంలోనూ ఇందిరమ్మ కమి టీల ఏర్పాటులో కాంగ్రెస్ గ్రూపు పోరు నివురుగ ప్పిన నిప్పులా ఉన్నది. మంత్రి కొండా సురేఖ, స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి వర్గాల మధ్య ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు కొత్త గొడవలను సృష్టి స్తున్నది. జనగామ, ఇల్లెందు నియోజకవర్గాల్లోనూ ఇందిరమ్మ కమిటీల ఏర్పాటుపై కాంగ్రెస్ గ్రూపు రాజకీయాలు ముదురుతున్నాయి. మిగిలిన నియో జకవర్గాల్లో కమిటీల ఏర్పాటు పూర్తిస్థాయిలో జర గడం లేదు. ఈ ప్రక్రియ వేగవంతమైతే అన్ని చోట్ల కాంగ్రెస్‌లోని వర్గాలు బహిరంగంగా పోటీ పడే పరి స్థితి కనిపిస్తున్నది.

కడియంపై టీపీసీసీ చీఫ్‌కు ఫిర్యాదు

వేలేరు, అక్టోబర్ 18: స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మె ల్యే కడియం శ్రీహరిపై వేలేరు మండల పాత కాంగ్రెస్ నాయకులు టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమా ర్‌గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. శుక్రవారం హైదరా బాద్‌లోని గాంధీభవన్ కార్యాలయంలో ఆయ నను మర్యాదపూర్వకంగా కలిసి పలు అంశాలపై మాట్లాడారు. పార్టీ కోసం పనిచేసిన కార్యకర్త లను విస్మరించి, ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. ఇందిరమ్మ కమిటీల ఎంపికలో వారికే అవకాశం కల్పిస్తున్నారని ఆరోపించారు. పూటకో పార్టీ మారే నాయకులకు అవకాశం కల్పిస్తే నియోజ కవర్గంలో నిరసనలు కొనసాగుతాయని హెచ్చ రించారు. ఎమ్మె ల్యే తన వైఖరి మార్చుకోకపోతే నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో జరిగే పరి ణామాలకు ఆయనే బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

- వర్షం.. ఆ వెంటే ఎండ

వాజేడులో విచిత్ర వాతావరణం

వాజేడు, అక్టోబర్ 18 : వాజేడులో భిన్నమైన వాతావరణం కనిపించింది. శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో అరగంట పాటు మోస్తరు వర్షం కురిసింది. ఆ తర్వాత విపరీతంగా ఎండ కొట్టింది. దీంతో ఎప్పుడు ఏ వాతావరణం ఉంటుందో అర్థం కావడంలేదని ప్రజలు చర్చించుకుంటున్నారు.

సర్వర్ డౌన్

సర్వర్ డౌన్‌తో ఖాళీగా ఉన్న మహిళా, పురుషుల రిజిస్ట్రేషన్ (బ్లడ్ శాంపిల్) కౌంటర్

వైద్యసేవలు ఆలస్యం

- అనుభవం లేని ఆపరేటర్లు
- రిజిస్ట్రేషన్‌కు గంటలకొద్దీ ఎదురుచూపులు
- మూడు రోజులకు ల్యాబ్ రిపోర్టులు
- ఏజెన్సీల చేతివాటం.. రోగులకు సంకటం
- కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ
- భూపాలపల్లి జిల్లా దవాఖానలో నిత్యం ఇదే పరిస్థితి

జయశంకర్ భూపాలపల్లి, అక్టోబర్ 18(నమస్తే తెలంగాణ) : సర్వర్ డౌన్. ఇది భూపాలపల్లిలోని జిల్లా ప్రధాన దవాఖా న(వంద పడకల ఆసుపత్రి)లో నిత్యం వినిపించే పదం. జిల్లా నలుమూలల నుంచి ఇక్కడికి రోజూ వందల సంఖ్యలో ప్రజలు చికిత్స కోసం వస్తుండగా ప్రతి రోజూ ఓపీ 1500 దాటుతుంది. అయితే ఓపీ మొదలు ల్యాబ్ రిపోర్టులు తీసుకొని చికిత్స చేయించుకునే దాకా అన్నీ ఆన్‌లైన్‌తో ముడిపడితో ఉంటుంది. కానీ రోగుల తాకిడికి అనుగుణంగా అధికారులు సౌకర్యాలు కల్పించకపోవడం, సర్వర్ సమస్యల వల్ల పేషెంట్లు, అటెం డెంట్లు ఇబ్బంది పడాల్సి వస్తోంది. సర్వర్‌డౌన్ కారణంగా ఓపీ, ల్యాబ్ రిజిస్ట్రేషన్, రిపోర్టులు తీసుకోవడం, చివరికి మెడిసిన్ తీసుకోవడం వరకు ప్రతీ చోట గంటల తరబడి ఎదురుచూ డడం ఇక్కడ నిత్యకృత్యమైంది. దీనికి తోడు అనుభవం లేని ఆపరేటర్ల వల్ల రిజిస్ట్రేషన్ మరింత ఆలస్యమై రోగుల ఓపికకు పరీక్ష పెడుతోంది. ఆరోగ్యం బాగా లేదని దవాఖానకు వస్తే ఇక్కడే ప్రాణంపోయేలా ఉన్నదని మండిపడుతున్న తీరు అధి కారుల పర్యవేక్షణ లోపానికి అద్దం పడుతున్నది.

శుక్రవారం ఉదయం ఏడు గంటల నుంచి తొమ్మిది గంటల వరకు సర్వర్‌డౌన్‌తో రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోగా షుగర్ వ్యాధి పరీక్షలు చేయించుకునేవారు, ఎమర్జెన్సీ పరీక్షలు(వార్డుల్లో ఉండే వారు) చేయించుకునే వారు చాలా ఇబ్బందులు పడ్డారు. ఏజెన్సీలు ముడుపులు తీసుకొని అర్హత లేనివారిని నియమిం చడంతోనే ఈ పరిస్థితి నెలకొందనే ఆరోపణలు వినిపిస్తు న్నాయి. ల్యాబ్ రిపోర్టులు సర్వర్‌డౌన్‌తో మూడు నాలుగు రోజులకు తీసుకోవాల్సిన పరిస్థితి దాపురిస్తుంది. ఉన్నతాధికా రుల పర్యవేక్షణ కొరవడడంతోనే కిందిస్థాయి సిబ్బంది ఇష్టా రాజ్యంగా వ్యవహరిస్తున్నారని రోగులు మండిపడుతున్నారు.

భూపాలపల్లిలోని జిల్లా దవాఖాన

ఈ ఆసుపత్రే పెద్ద దిక్కు

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఈ ఆసుపత్రే జనాలకు పెద్ద దిక్కు. జిల్లాలోని మారుమూల ప్రజలతో పాటు పక్క రాష్ట్ర మైన మహారాష్ట్ర నుంచి వైద్యం కోసం ఇక్కడికి వస్తుంటారు. ఇరు రాష్ట్రాల ప్రజలకు అనువుగా ఉంటుందని బీఆర్ఎస్ ప్రభు త్వం భూపాలపల్లిలో వంద పడకల దవాఖాన నిర్మించింది. ఇది వేలాదిమందికి సంజీవనిగా మారింది. అయితే ఇప్పుడు అధికారుల పర్యవేక్షణ లేక, ఏజెన్సీ కాంట్రాక్టర్ల చేతివాటంతో ప్రజలకు శాపంగా మారింది. జిల్లాలో 13 ఆరోగ్య కేంద్రాలు, రెండు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఒక పట్టణ ఆరోగ్య కేంద్రం, 65 పల్లె దవాఖానలు, 90 సబ్ సెంటర్లు, ఒక జిల్లా దవాఖాన ఉన్నాయి. అయితే అన్ని దవాఖానల నుంచి ప్రతిరోజూ మెరు గైన వైద్యం కోసం భూపాలపల్లికి సిఫారసు చేస్తుంటారు. ఈక్ర మంలో జిల్లా దవాఖానకి తాకిడి పెరుగుతుండగా సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలం అవుతున్నారు.

అనుభవం లేని ఆపరేటర్లే అసలు సమస్య

జిల్లా దవాఖానలో అనుభవం లేని కంప్యూటర్ ఆపరేటర్ల తోనే అసలు సమస్య వస్తోంది. నియమించే ముందు వారికున్న కంప్యూటర్ పరిజ్ఞానం ఏమిటి? సర్టిఫికెట్ ఒరిజినలేనా? టైపిం గ్ స్పీడ్ ఎంత అనే కనీస అర్హతలు చూడకుండా ఏజెన్సీ కాం ట్రాక్టర్ ముడుపులు తీసుకుని నియమించడంతో ఒక్కో రిజిస్ట్రే షన్‌కు పావు గంట వేచి చూడాల్సి వస్తుందని రోగులు ఆరోపి స్తున్నారు. ఆసుపత్రిలో ఓపీ, ల్యాబ్ రిజిస్ట్రేషన్, ల్యాబ్ రిపో ర్టులు ఇచ్చే విభాగం, మెడిసిన్ ఇచ్చే కౌంటర్ వద్ద ప్రధానంగా అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని నియమించారు. వీరి పనితీరును ఉన్నతాధికారులు ఏనాడూ పర్యవేక్షించకపోవడంతో వారే పర్మి నెంట్ ఉద్యోగులుగా చెలాయిస్తున్నట్లు స్పష్టమవుతోంది.

సమస్యలపై దృష్టి సారిస్తా..

జిల్లా దవాఖానలో సర్వర్‌డౌన్ గురించి తెలిసింది. టీ హబ్‌కు రక్తనమూనాలు పంపాలంటే ఆన్‌లైన్ తప్పనిసరి. ఆఫ్‌లైన్‌లో చేయడం కుదరడం లేదు. అసలు సర్వర్ సమ స్య ఎక్కువగా ఎందుకు వస్తుందోననే విషయమై సమా వేశం నిర్వహిస్తా. అలాగే ఔట్ సోర్సింగ్ ఆపరేటర్లు, సిబ్బందిపై ప్రత్యేక దృష్టిపెట్టి నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకుంటా.

- కోడూరి నవీన్‌కుమార్,
జిల్లా దవాఖాన సూపరింటెండెంట్



సర్వర్ డౌన్ కావడంతో ఓపీ రిజిస్ట్రేషన్ కోసం వేచి ఉన్న పేషెంట్లు

వాడీవేడిగా దిశ సమావేశం

- స్కూళ్లు, పీహెచ్‌సీల నిర్వహణ బాగా లేదన్న ఎమ్మెల్యేలు
- పీడీఎస్ రైస్ రీసైక్లింగ్ జరుగుతున్నా చర్యలేవి?
- బాధ్యులైన డీలర్లపై చర్యలు తీసుకోవడం లేదన్న ఎమ్మెల్సీ
- తాగు, సాగు నీటి సరఫరాపై ప్రజాప్రతినిధుల నిరసన
- డీఈవో జ్ఞానేశ్వర్‌పై దిశ చైర్మన్ బలరాంనాయక్ ఆగ్రహం

అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న దిశ చైర్మన్ బలరాంనాయక్, పక్కన మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ సత్యశారద, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్, అక్టోబర్ 18(నమస్తేతెలం గాణ): అధికారుల తీరుపై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. శుక్ర వారం వరంగల్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అభివృద్ధి సహకార, మని టరింగ్ కమిటీ(దిశ) సమావేశం జరిగింది. చైర్మన్, మహ బూబాబాద్ ఎంపీ పోరిక బల రాంనాయక్ అధ్యక్షత వహించిన ఈ సమావే శంలో నర్సంపేట, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు దొంతి మాధవరెడ్డి, కేఆర్ నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజు సార య్య, నగర మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ డాక్టర్ సత్యశారద, అదనపు కలెక్టర్ సంధ్యా రాణి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీవా కడే పాల్గొన్నారు. ప్రధానంగా కేంద్ర ప్రభుత్వ నిధులతో జిల్లాలో చేపట్టిన అభివృద్ధి, అమ లవుతున్న సంక్షేమ కార్యక్రమాలతోపా టు రాష్ట్ర ప్రభుత్వ పథకాల పురోగతిపై చర్చ జరి గింది. ఎమ్మెల్యే మాధవరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ సరిగా లేద న్నారు. బాలికలు ఎక్కువ మంది ఉన్న స్కూళ్లలో సీసీ కెమెరాలను అమర్చి వాటిని స్థానిక పోలీస్ స్టేషన్‌కు అనుసంధారించాలని ఎమ్మెల్యే నాగరాజు అన్నారు. జిల్లాలోని ఆయా ప్రభుత్వ పాఠశాల వారీగా వివరాలను తనకు అంద జేయకపోవడంపై ఎంపీ బల రాంనాయక్ డీఈవో జ్ఞానేశ్వర్‌పై దిశ చైర్మన్ ఆగ్రహం వెలిబుచ్చారు.

పీడీఎస్ రైస్ రీసైక్లింగ్

పీడీఎస్ రైస్ రీసైక్లింగ్ జరుగుతుందని, ఏం చర్యలు తీసుకుంటున్నారని ఎమ్మెల్యే మా ధవరెడ్డి అధికారులను ప్రశ్నించారు. పీడీ ఎస్ రైస్‌ను పక్కదారి పట్టించిన రేషన్ డీల ర్లలో ఎందరిపై చర్య తీసుకున్నారని, ఎందరి డీలర్‌షిప్‌లను రద్దు చేశారని, ఎంతమందిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారని ఎమ్మెల్సీ సారయ్య అన్నారు. ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ కొన్ని రైస్‌మిల్లుల నిర్వాహ కులు రెగ్యులర్‌గా పీడీఎస్ రైస్‌ను కొంటున్నా రన్నారు. జిల్లాలో మహిళా, శిశు సంక్షేమ శాఖకు కేంద్రం నుంచి గత ఆర్థిక సంవత్స రంలో రూ.30 లక్షలు వస్తే వాటిలో రూ.20 లక్షలు ఖర్చు చేయకపోవడంపై ఎంపీ ఆగ్రహం వెలిబుచ్చారు.

ఇంజినీర్ల తీరుపై ఆగ్రహం

నర్సంపేటలో నాలుగు రోజుల నుంచి నీటి సరఫరా నిలిచిపోయి ప్రజలు ఇబ్బంది పడు తున్నారని ఎమ్మెల్యే మాధవరెడ్డి అన్నారు. పైపులైన్లు, వాటర్‌ట్యాంకుల నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నగర మేయర్ సుధారాణి మాట్లాడుతూ ప్రజారోగ్యశాఖ, జీడబ్ల్యూ ఎంసీ ఇంజినీర్ల సమన్వయంతో పనిచేసి నీటి సరఫరాలో సమస్యలను పరిష్కరించాలని అన్నారు. ప్రజారోగ్యశాఖ ఎస్ఈ సమావేశానికి రాకపోవడంపై ప్రజాప్రతినిధులు నిరసన వెలిబుచ్చారు. సమావేశంలో నర్సంపేట, వర్ధన్నపేట మున్సిపల్ చైర్‌పర్సన్లు గుంటి రజిని, అంగోతు అరుణ, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, డీఏవో అనురాధ, సీతావో రాం రెడ్డి, కుడా పీవో అ